నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
మంగళవారం | ఏప్రిల్ 16 , 2024 | www.navatelangana.com

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-మిర్యాలగూడ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు మిర్యాలగూడ సబ్ డివిజన్ ఏడిఈ కోడి రెక్క రవికుమార్, టౌన్-2సెక్షన్ ఏఈ, ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.00 గంటల నుండి 10.30 గంటల వరకు మిర్యాలగూడ టౌన్ - 2 పరిధిలోని 33కెవి ఎఫ్‌సీఐ సబ్ స్టేషన్ నుండి 11కెవి హనుమాన్ పేట ఫీడరు కింద కొత్త 33 కెవి లింక్ లైన్ పని గురించి ఎల్ సి తీసుకోబడునని దీనికి గాను విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని గాయత్రి నగర్, హనుమాన్ పేట, నాగార్జున నగర్, రెడ్డి కాలనీ, ముత్తిరెడ్డి కుంట, అశోక్ నగర్ లోని కొంత ఏరియాకు విద్యుత్ సరఫరా నిలుపు వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువత స్వయం శక్తితో ఎదగాలని నకరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివ డిస్పోజబుల్ పూజా సామగ్రి దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాసం శ్రీనివాస్‌రెడ్డి, షాపు యజమాని భానుచందర్ మాజీ సర్పంచ్ పుల్లంల అచ్చాలు, బింగి కొండయ్య, స్వామి, కాంగ్రెస్ నాయకులు సట్టు సత్తయ్య భూపాల్ రెడ్డి, రమేష్, శంకరయ్య, భరత్, సమద్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు రావు

- కేసీఆర్ డ్రామాలు ప్రజలు నమ్మరు
- బీజేపీతో తెలంగాణకు ఒరిగిందేమీ లేదు
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్



రామన్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కు డిపాజిట్లు కూడా రావని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం పన్నాలగడెం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువయ్యారని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనబడదన్నారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ ఏమీ చేయలేదన్నారు. పేదల కనీస అవసరాలు తీర్చలేదని పేర్కొన్నారు. బీజేపీ అన్ని ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారా దత్తం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లకు పైగా కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనార్టీలు, క్రైస్తవులు ఎస్సీ, బీసీలకు రక్షణ కావాలంటే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నారు. ఈ నెల 17న నకిరేకల్ నియోజకవర్గంలో కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో 305 బూతు స్థాయి కమిటీల సమావేశంలో జరుగుతున్నదన్నారు. ఈ సమావేశానికి భువనగిరి పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ,ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో బూత్ స్థాయి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగే సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, టీపీసీసీ మేనిఫెస్టో సభ్యులు చామల శ్రీనివాస్, నాయకులు జిల్లా ముత్తింగం, భక్తుల భూషయ్య, మాద యాదగిరి, పన్నాల రాఘవరెడ్డి, నాగులంచ వెంకటేశ్వరరావు, గాజుల సుకన్య, బొజ్జసుందర్, యాసారపు శ్రీను, గుత్తా మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

నామినేషన్ల ప్రక్రియకు
రాజకీయ పార్టీల సహకారం అవసరం

- ఈనెల 18 నుండి 25 వరకు నామినేషన్లు
- మధ్యాహ్నం 3 తర్వాత స్వీకరణ ఉండదు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



లోకసభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు పూర్తి సహకారమందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నామినేషన్ల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలపై ఆయన వివరించారు. ఈనెల 18 నుండి 25 వరకు నామినేషన్లను స్వీకరణ, 26 నామినేషన్ల పరిశీలన, 29 న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్న 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు వారితోపాటు, అనుమతించే వ్యక్తులు, వాహనాలు, తదితర అంశాలను వివరించారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ కోసం కొత్త ఖాతా తెరవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12500 , సాధారణ అభ్యర్థులు రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీ ల ప్రతినిధులకు ఆయన అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పాటించాల్సిన నియమ నిబంధనలు, ప్రజా ప్రతినిధ్య చట్టం పై వివరంగా తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రచురించే కరపత్రాల విషయంలో ప్రజా ప్రతినిధ్య చట్టంలోని 127-ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, సీపీఐ(ఎం) నుండి నర్సిరెడ్డి ,కాంగ్రెస్ నుండి అశోక్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి బక్క పిచ్చయ్య, బీజేపీ నాయకులు పోతెపాక లింగస్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ జనరల్ సెక్రెటరీ యార శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో...
ఈత కొట్టేందుకు వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ -చిట్యాలటౌన్



స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన చిట్యాల పట్టణ శివారులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నూనె సంజీవ కుమారుడు శ్రవణ్ కుమార్ (22) పట్టణ శివారులో కేకేఆర్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు తన స్నేహితులు బాలాజీ ,వెంకన్న, సాయిలుతో కలిసి చిట్యాలకు వచ్చాడు. మధ్యాహ్న సమయంలో స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు అందులో దూకగా ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన తోటివారు శ్రవణ్ కుమార్‌కు గాయమైనట్లుగా గుర్తించి స్విమ్మింగ్ పూల్ నిర్వాహకులకు తెలిపారు. హుటా హుటినా చికిత్స నిమిత్తం శ్రవణ్ కుమార్‌ను నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌కి తరలిస్తుండగా మృతి చెందాడు. స్విమ్మింగ్ పూల్ యజమాని కందాడి కృష్ణారెడ్డి స్విమ్మింగ్ పూల్‌లో ఎలాంటి నిబంధనలను పాటించకపోవడంతో తన కుమారుడు మృతి చెందాడని శ్రవణ్ కుమార్ తల్లి బుగ్గమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుకున్నట్లు చిట్యాల ఎస్ఐ-2 కె. లింగయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

బీసీల రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్

నవతెలంగాణ-మిర్యాలగూడ



బీసీలను పట్టిపీడిస్తున్న పేదరికం వెనుకబాటు తనం నుంచి వారిని బయట పడేసే ప్రయత్నంలో బీపీ మండల్ చేసిన కృషి మరవలేనిదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మండల్ 42వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు రిజర్వేషన్ల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి మాదిగ యువజన జేఏసీ నియోజకవర్గం కన్వీనర్ పెదమం వీరస్వామి, మంద శివ, ఈశ్వర్, శేఖర్ పాల్గొన్నారు.



ముత్యాలుకు స్వర్ణ నంది పురస్కారం

నవతెలంగాణ - నాంపల్లి

మండలంలోని తిరు మలగిరి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత భూతం ముత్యాలు సూరీడు అనే లఘు చిత్రానికి రాసిన పాటకు ఉగాది స్వర్ణ నంది పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు చేరాల ప్రకాష్ లలిత దంపతుల నిర్వహణలో హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో డాక్టర్ దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో నిర్వహించిన ఉగాది స్వర్ణనంది పురస్కారాల సందర్భంగా ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ ప్రముఖ సినీ నటులు మా ఈసీ సభ్యులు మాణిక్, ప్రముఖ సినిమా టీవీ నటులు రాజేందర్, విజయ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ అమరావతి అసెంబ్లీ ఓ ఎస్ డి డాక్టర్ ఎం ప్రభాకర్, కొత్త కనకరత్నమాల తదితరులు హాజరయ్యారు.

రూ.2 .20లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-చండూరు



ఎన్నికల కోడ్ సందర్భంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని అంగడిపేట గ్రామ శివారులోని బీఆర్‌సీ ఫంక్షన్‌హాల్ వద్ద ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఇడికుడ గ్రామం వైపు నుండి బైక్ దారుడిని తనిఖీ చేయగా నల్ల అశోక్ వద్ద రూ. 2లక్షలా 20వేలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళు నందున సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి పంపించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు, వ్యాపారస్తులు, రూ.50 నగదు కంటే ఎక్కువ మొత్తాన్ని డబ్బును వెంట తీసుకువెళ్లరాదని, ఒకవేళ ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకువెళ్లాలంటే ఆ డబ్బుకు సంబంధించినపూర్తి వివరాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నాంపల్లి



మండలంలోని రేవల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రేవెల్లి వెంకులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి అతని సభ్యులను పరామర్శించి ఖర్చుల నిమిత్తం రూ.పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూల.వెంకటయ్య, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, తుమ్మలపల్లి చంద్రారెడ్డి, బట్టు శ్రీను, తుమ్మలపల్లి లింగారెడ్డి, కోన్ రెడ్డి యాదయ్య, కోన్ రెడ్డి వెంకటయ్య, బట్టు జగన్, మేకల కొండల్, బట్టు శ్రీశైలం, మేకల రాములు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్న ఆర్ఎస్ఎస్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి

నవతెలంగాణ -చిట్యాల టౌన్



డా.బీఆర్ అంబేద్కర్ రచించిన భారత దేశ రాజ్యాంగంను మార్చాలని ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఆ పార్టీ గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం యువత పని చేయాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ మాట్లాడుతూ పేదల హక్కుల పరిరక్షణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన అంబేద్కర్ పేద ప్రజల దేవుడని, అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా ఉండే అవకాశవద శక్తులకు వ్యతిరేకంగా యువత నడుం బిగించాలని కోరారు.మెట్టు పరమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రూరల్ మండల కార్యదర్శి అరూరి శ్రీను, మండల నాయకులు మెట్టు నర్సింహా, వివిధ ప్రజా సంఘాల నాయకులు మెట్టు శ్రీశైలం, ఊడుగు సత్తయ్య బలరాం, మురళి,ఇస్తారి, దుర్గయ్య, మల్లయ్య,లాలు, యాదయ్య, లక్ష్మి, యాదమ్మ, పార్వతమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను పార్లమెంటుకు పంపించండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల

నవతెలంగాణ-నకిరేకల్



ప్రశ్నించే గొంతుక సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జైహింద్వీర్ ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల కోరారు. సోమవారం పట్టణంలోని పన్నాల గూడెంలో ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న స్వార్థ అవకాశవాద రాజకీయ నాయకులను ఓడించి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఎండి జహంగీర్ ను ప్రజలు ఆదరించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి పార్లమెంటుకు పంపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చుపెట్టి మనువాద సిద్ధాంతరను అమలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి గద్దెనెక్కడం కోసం మతాల, కులాల మధ్య గొడవలు జరిగినట్టు సినిమాలు చిత్రీకరించి దేశంలో గొడవలు సృష్టించి హిందువాదం పేరుతో ప్రజల దృష్టి మళ్లిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు చౌకగా దారా దత్తం చేస్తుందన్నారు. పదేళ్ల నుండి ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వంటపాక వెంకటేశ్వర్లు, ఏరియా కార్యదర్శి సిహెచ్ నాగమణి, వంటిపాక కృష్ణ, పన్నాల శశికళ, సకుంట నరసింహ, ఏర్పుల రాజేశ్వర్, గురుజ స్వరూప, సుంకి మనమ్మ, ఆర్ ఇందిరా పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-చండూరు



నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ (ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి. జహంగీర్ ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం కోరారు. సోమవారం పట్టణంలో, మండలంలోని శిర్ధ పల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహంగీర్ గత 35 ఏండ్లుగా పార్టీలో నిస్వార్థంగా పనిచేస్తూ అనునిత్యం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నట్లు గుర్తు చేశారు. చట్టసభల్లో వామపక్ష అభ్యర్థులు లేకపోతే రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. సాగునీరు అందించే పాలమూరు- రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం, బస్వాపురం, గంధ మల్ల దేవాదుల, ప్రాజెక్టులు పూర్తి చేయాలని, విద్య, వైద్యం ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఆయనకు, సీపీఐ(ఎం)కు ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి మోగుదాల వెంకటేశం, మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, చిట్టి మల్ల లింగయ్య, ఈరటి వెంకన్న, నారపాక శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ అనురాధ అన్నారు. సోమవారం మండలంలోని చిన్న అడిచర్లపల్లి, పెండ్లిపాకల గ్రామాల్లో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు జరపాలన్నారు. అక్కడ రైతుల వసతుల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారుగా 70 మంది రైతుల నుంచి 4300 కింటాళ్ళ ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ శ్యాంసుందర్ రెడ్డి, సిఇఓ కొనుగోలు నిర్వాహకులు పళ్ళ తిరుపతిరెడ్డి, పాపిరెడ్డి రైతులు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ వెంకటయ్య మృతి బాధాకరం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అంబేద్కర్ వెంకటయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు, సోమవారం మండలకేంద్రంలో వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సందర్భంగా ఆయనమాట్లాడుతూ వెంకటయ్య మృతి బాధాకరమని అన్నారు.

ఐదురికి ప్రాణం పోసం వెంకటయ్య

మూడు రోజుల క్రితం అంబేద్కర్ వెంకటయ్య హైదరాబాదులోని తుర్కయంజాల నుంచి కొండమల్లేపల్లికి వస్తుండగా మార్గమధ్యలో ఆగపల్లి గేటు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాదులో ఓ ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య చికిత్స అందిస్తుండగా వెంకటయ్య బ్రెయిన్ డెడ్ తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెంకటయ్య అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. మృతదేహాన్ని నిమ్స్ ఆసుపత్రికి తరలించి లివర్, కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, నేత్రాలను దానంచేసి మరో ఐదుగురికి ప్రాణం పోశాడు. వెంకటయ్య మృతదేహాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు దూదిపాల శ్రీధర్ రెడ్డి, జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉట్కూరు వేమన్ రెడ్డి, జడ్పిటిసి సలహాదారుడు పసునూరి యుగంధర్ రెడ్డి, కొండమల్లేపల్లి మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, అందుగుల ముత్యాలు, ఉపసర్పంచ్ గంధం సురేష్, కైసర్ ఖాన్, వసుకుల బక్కులయ్య, ఏవి రెడ్డి, తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి

- డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ



నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు పూర్తి చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గుర్రంపోడు మండలం ఎంపీపీ మంచి కంటి వెంకటేశ్వర్లు సోమవారం స్థానిక రాజీవ్ భవన్ లో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలోనే ఆ మండలం నుంచి పదిమంది సర్పంచులు ముగ్గురు ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి ని భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్కైలాబ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, గుర్రంపోడు మండల అధ్యక్షులు సర్వయ్య జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు రంగినేని నరసింహారావు మాజీ ఎంపీపీ జగదీశ్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ రెడ్డి నాయకులు రాధాకృష్ణ పంతులు, గణేష్ నాయక్, కుక్కల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



యాసంగి సీజన్లో రైతులు పండించిన పంటను శుభ్రపరచి ఆరబెట్టుకుని తీసుకొచ్చి వరి ఏ గ్రేడ్ కనీస మద్దతు ధర రూ.2203 పొందాలని ఆర్డీఓ ఎన్.రవి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో కల్పించిన సదుపాయాలు , ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్, అజమ్ ఖాన్ ఆర్ఐ,తరుణ్ ఏఈఓ, విజయలక్ష్మి, సీఈవోవెంకటయ్య రైతులు పాల్గొన్నారు.

మిత్రుని కుమార్తెకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

మండలంలోని వెలిమినేడు గ్రామంలో సోమవారం1998-99 10వ తరగతి విద్యార్థులు 20 ఏండ్ల క్రితం చనిపోయిన మిత్రుడు గోధుమ గడ్డ కరుణాకర్ రెడ్డి కూతురు కు ఉన్నత చదువులకుకోసరి 66 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాటకారి మహంకాళి, నాతి శ్రీనివాస్ గౌడ్, చెరుకు పాండు, గుండాల జంగయ్య బుట్టి వెంకటేష్, ఆరూరి రమేష్, ఆరూరి శ్రీనివాస్ ,బొంతల నరేందర్ రెడ్డి ,బొంతల సుధాకర్ రెడ్డి, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మండల కేంద్రంలోని పెంచికలదిన్నె గ్రామంలో మసీదు ప్రక్కనున్న ప్రస్తుత నీటి ప్రవాహం లేని వాగు లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. వాగు కిరువైపులా ఉన్న నివాసులు అయోమయస్థితిలో భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామస్తులు వీరమాచినేని కృష్ణయ్య , పసుపులేటి నరసింహారావు , భార్గవ్ సైదులు , అల్వాల శ్రీధర్ , షేక్ జానీ , గంట నాగరాజు , జీడిమెట్ల సైదులు , పెండెం హరిబాబు మంటలు చల్లార్చే ప్రయత్నం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసుకు తెలియపరచగా వెంటనే అప్రమత్తమై గ్రామపంచాయతీ వాటర్ ట్యాంక్ సిబ్బందితో పంపించారు. ఆ వాటర్ ట్యాంక్ ద్వారా మరియు నీటి పైపుల ద్వారా మంటలను చల్లార్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నేరేడుచర్ల మండల కేంద్రానికి ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో వేసవికాల అధిక ఎండల దృష్ట్యా అకారణంగా అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, ఇట్టి అగ్ని ప్రమాదాల నుండి ప్రజల ఆస్తులు ప్రాణాలు కాపాడుటకు మన నేరేడుచర్ల మండల పరిధిలో అగ్నిమాపక కేంద్రం ఫైర్ స్టేషన్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

నవతెలంగాణ-హుజూర్‌నగర్



పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో రెండవ రోజు తిలక్‌నగర్‌లో అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కోలపూడి యోహాను మాట్లాడుతూ తిలక్ నగర్లో విగ్రహం ఏర్పాటు చేసినప్పటి నుండి కాలనీలో ఎవరు ఆపదలో ఉన్నప్పటికీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారికి సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రేణుక కోలపూడి దయాకర్ కళ్యాణ్ ఇమ్మానియేల్ ఎరిమియా యేసు రత్నం బెంజమెన్ జాన్ వెలసి అబ్రహం పలువురు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల పనులు జూన్ 5 కల్లా పూర్తి చేయాలి

- 576 పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు
- ధాన్యం కొనుగోళ్లు వేగం పెంచాలి
- కలెక్టర్ ఎస్ .వెంకట్రావు



నవతెలంగాణ-సూర్యాపేటరూరల్

జిల్లాలోని 584 అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను జూన్ 5వ తేదీ కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. సోమవారం సూర్యాపేట మండలంలోని భాషా నాయక్ తండ గ్రామంలో గల(mppo) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో గుర్తించబడిన 584 ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు చదువుకోవాలని, ఉద్దేశంతో వసతుల కల్పన కోసం తాగునీరు, విద్యుత్తు, బాలికల టాయిలెట్స్ ,సుందరీకరణ పనులు నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసిన పాఠశాలలో సంబంధిత కమిటీ సభ్యులతో కలిసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో 576 పాఠశాలలో కమిటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే 555 పాఠశాలల కమిటీలు బ్యాంకు ఖాతాలను ప్రారంభించారని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు .రైతుల కొరకు వేసిన చలవ పందిళ్లను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. తేమ శాతం యంత్రం ద్వారా రైతులకు తెచ్చిన ధాన్యాన్ని దానిలో పరిశీలించారు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినప్పుడు ధాన్యాన్ని మంచిగా ఆరబెట్టుకుని రావాలని సూచించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులు ఐరిష్ వల్ల చాలా ఇబ్బందులు గురవుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీని నుండి మినహాయింపు కోరవాల్సిందిగా ప్రభుత్వానికి తెలపాలని ఈ సందర్భంగా వారు కోరారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే వారికి కేటాయించడం మిల్లులకు రవాణా చేయాలని కలెక్టర్ ఆదేశించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ ప్రసాద్,పిఎసిఎస్ వేంకట రెడ్డి, వెంకటేష్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కార్మిక వర్గం కోసం పనిచేసే ..

జహంగీర్‌ను పార్లమెంటుకు పంపించండి

- సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు

నవతెలంగాణ-తిరుమలగిరి

పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడే సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి.జహంగీర్ ను గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో రైతు, కూలీలను కలిసి కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్ గత 35 ఏండ్లుగా తన జీవితాన్ని పణంగా పెట్టి పేదల కోసం, కార్మికుల కోసం, కర్షకుల కోసం పీడిత ప్రజల పక్షాన అనేక పోరాటాల నిర్వహించిన చరిత్ర ఉందన్నారు. అలాంటి చరిత్ర మిగతా పార్టీ అభ్యర్థులలో ఎవరికి ఉందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు అంటే డబ్బులతో ఓట్లు కొనుక్కోవడం అనుకునే నాయకులకు బుద్ధి చెప్పాలంటే సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ



జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పులుసు సత్యం, సీపీఐ(ఎం) మండల కన్వీనర్ జి. ఉప్పలయ్య, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మిట్టపల్లి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వనం సోమయ్య,సిఐటియు పట్టణ కార్యదర్శి నిర్మాణ యాకయ్య, నాయకులు మిర్యాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోజులు గడుస్తున్నా మారని ఉపాధి హామీ పనితీరు

- ఎండలోనే కూలీలు పనులు

నవతెలంగాణ-మోతే



రోజులు గడుస్తున్నా ఉపాధి హామీ పనితీరు మారడం లేదని కూలీలు లబోదిబోమని మొత్తుకుంటున్నారు మండలంలో 4700 మంది కూలీలు దరఖాస్తు పెట్టుకున్నారు 3672 మందికి పని కనిపించినట్లు సమాచారం దరఖాస్తు పెట్టుకున్న 15 రోజుల్లో పని కల్పించాలి లేకపోతే కూలి ఇంటి దగ్గర ఉన్న రోజుకు వంద రూపాయలు చొప్పున చెల్లించాలని ఆనాడు చట్టంలో డిమాండ్ ఉంది. బీజేపీ ప్రభుత్వ పాలనలో కరువు పనిని నీరు కాస్తుందని వ్యవసాయ కార్మిక సంఘరం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు ఆవేదన వ్యక్తం చేశారు కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు పారా గడ్డపార తట్టా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు కూలీలకు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉంచాలని నిబంధన ఉన్నది అక్కడ అమలు కావడం లేదని విమర్శించారు. పని ప్రదేశంలో టెంట్ వసతి కల్పించాలి. కూలీల పోషకానికి ఒక ఆయాను నియమించాలి. నిబంధన ఉన్న అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన ఉపాధి కూలికి 300 రూపాయలు కొలతలతో సంబంధం లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి ఐదు కిలోమీటర్ల దూరం దాటితే అదనపు కూలి చెల్లించాలని చట్టంలో ఉన్న ఎక్కడ అమలు కావటం లేదని విచారంవ్యక్తం చేశారు. కమ్మరి కొలిమి దగ్గర గడ్డపార సాన బడితే 15 రూపాయలు చెల్లించాలని కోరారు. మంచినీళ్ల బాటికి రెండున్నర రూపాయలు చెల్లించాలని కోరారు. గత శనివారం మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు నీళ్ల నీడ వసతుల సౌకర్యాలు లేక సొమ్మసిల్లి పడిపోయారు. పని ప్రదేశాల్లో వసతి కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

రైతులకు తప్పని గడ్డి వెతలు

- పశువుల గ్రాసానికి రైతుల నానా తంటాలు
- యంత్రాలతో కోయించడంతో సగానికి తగ్గుతున్న వరిగడ్డి

నవతెలంగాణ-మునగాల



పాడి రైతులకు వరిగడ్డి వెతలు తప్పటం లేదు. పశువుల గ్రాసం కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. వరి పంటలను యంత్రాలతో కోయించటంతో గడ్డి కొరత మరింత తీవ్రమైంది. గత పది పదిహేను సంవత్సరాలుగా రైతాంగం అత్యధికంగా వరి యంత్రాలతోనే పంటలను నూర్పిడి చేయిస్తున్నారు. వ్యవసాయ కూలీల చేత పంటలు కోయిస్తే పూర్తి స్థాయి ఎండుగడ్డి చేతికందే అవకాశం ఉంది. యంత్రాలతో పంటలు కోయటం వలన సగం గడ్డికూడా చేతికి రావటం లేదు. కూలీలైతే కొడవళ్ళతో పంటను మొదలు వరకు కోస్తారు. అదే యంత్రమైతే వరి పైరును సగం వరకే కోస్తుంది. దీంతో ఎకరానికి వంద వరి మోపులు అయ్యోది యంత్రాలతో యాభై మోపులు కూడా కావటం లేదు. అరకొరగా దొరికే గడ్డి కోసం రైతులు ఆరాటపడుతున్నారు. భూసామికి ఎకరాని వెయ్యి రూపాయలిచ్చి గడ్డిని కొంటున్నారు. మోపుకు 30 రూపాయలిచ్చి మిషన్‌తో మోపులు కట్టిస్తున్నారు. అదే కూలీల చేత గడ్డి కట్టలు కట్టిస్తే మోపుకు 20రూపాయల వరకు ఖర్చు అవుతుంది. ఇంటికి చేరవేసేందు కూలీలకు మోపుకు15. ట్రాక్టర్ కిరాయి 500 వరకు ఖర్చులవుతున్నాయి. మొత్తంగా ఒక్కొక్క గడ్డి మోపుకు రు.70 నుంచి 85 వరకు ఖర్చు అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా గడ్డి దొరకడం లేదని రైతులు తెలుపుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింది సాగు చేసిన వరి పంటలు అధిక శాతం ఎండిపోయాయి నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఈ ఏడాది నీటి విడుదల లేకపోవడంతో పశుగ్రాసంకు తీవ్ర కటకట ఏర్పడింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు బావుల కింద సాగు చేసిన పంటలు కూడా ఎండి పోవటంతో గడ్డి సమస్యలు ఎదురౌతున్నాయి. పంటలుసాగు లేని కారణంగా ప్రస్తుత వేసవి కాలంలో చేను చలకల్లో కూడా గేదెలకు మేత దొరికే పరిస్థితి కనిపించటంలేదు. ఏడాది పొడవునా గేదెలను సాదుకునేందుకు రైతులు గడ్డిని సేకరించే పనిలో పడ్డారు. అనేక మంది పాలను అమ్ముకుని నెలవారి కుటుంబ ఖర్చులు ఎల్లదీసుకుంటున్నారు. అన్ని ప్రాంతాల్లోని రైతులను గడ్డి సమస్య వెంటాడుతోంది. పాడి గేదెలను పోషించటం ఎలా అని ఆందోళన చెందుతున్నారు. వరిగడ్డి కొరతతో రైతులకు పశుపోషణ మరింత భారంగా మారింది.

రైస్ మిల్లులను తనిఖీ చేసిన ఆర్డీఓ

నవతెలంగాణ-కోదాడరూరల్



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైస్ మిల్లులను ఆర్డీఓ సూర్యనారాయణ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని వసుంధర రైస్ మిల్లు, ధనలక్ష్మి రైస్ మిల్లు, జయలక్ష్మి రైస్ మిల్, కన్యకా పరమేశ్వరి రైస్ మిల్‌లను ఆర్డిఓ సూర్యనారాయణ తనికి నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని మిల్లులు తమ కెపాసిటీ తగ్గట్టుగా ప్రతిరోజు పంపించాలి అని సూచించారు. అన్ని మిల్లులను కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తీసుకుని రావాలి అన్నారు. సీఎంఆర్ బియ్యం కంపెనీలో జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు, ఆ యా మిల్లులకు సంబంధించిన యజమానులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

నవతెలంగాణ-మునగాల

మండలంలోని తిమ్మారెడ్డి గూడెం గ్రామ ప్రాథమిక పాఠశాల సమీపంలో ఆర్‌అండ్‌బి రోడ్డు వెంట వున్న కల్వర్టును వెంటనే నిర్మాణం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదర మెట్ల వెంకటేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌అండ్ బి అధికారులు కల్వర్టు ను కట్టకుండా వ దిలేయటం ఏమిటని ప్రశ్నించారు. దీంతో గ్రామ ప్రజలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని చెప్పారు అధికారులు త్వరితగతిన మరమతు లు చేయాలని సూచించారు. ఇంకా రహదారికి ఆనుకొని వున్న కరెంటు స్తంభాలను కూడా తొలగించాలన్నారు. రోడ్డుపై అక్కడక్కడ అసంపూర్తిగా వదిలే సిన కల్వర్టులను కూడా రిపేరు చేసి ప్ర జల ఇబ్బందులు తొలగించాలన్నారు.

అక్రమంగా మద్యం ,డబ్బులను తరలిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ -నల్లగొండడెస్క్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం డబ్బులు తరలిస్తే వారిపై చర్యలు తీసుకు ంటామని ఎస్సై యాకూబ్, ఫ్లయింగ్ స్కాట్ దారం శ్రీనివాస్ అన్నారు. సోమవారం అర్వపల్లి మండల కేంద్రంలోని నకిరేకల్ తానంచర్ల జాతీయ రహదారిపై వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు ప్రజలు 50 వేలకు పైబడి ఉంటే ఎలాంటి పత్రాలు లేకపోతే వాటిని సీజ్ చేస్తామని వారన్నారు. గ్రామాల్లో మద్యం డబ్బులు తలిస్తే వారిపై చర్య తీసుకుంటామని పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని అక్రమంలో పాల్పడకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేస్తామని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు చెల్లించిన వారిపై సీజ్ చేసి అధికారులకు అప్పగిస్తామని వారన్నారు .ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామలింగయ్య పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మద్దిరాల

పోలుమల్ల స్టేజ్ కి దగ్గరలో జాతీయ రహదారి కి పక్కన సర్వే నెంబర్ 367 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేసిన వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరుషరాములు అన్నారు. సోమవారం తహశీల్దార్ అమీన్ సింగ్ కు వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణాన్ని చేపట్టారని అధికారులు వెంటనే సర్వే చేసి అక్రమ నిర్మాణాన్ని చేపట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, ఇమ్మడి వీరా స్వామి,సారగుండ్ల వీరయ్య తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యల పట్టింపేదీ ?

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వట్టేపు సైదులు

నవతెలంగాణ-నల్లగొండ డెస్క్



మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు నెలలు కొద్దీ జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం గానీ సంబంధిత అధికారులు కానీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వట్టేపు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే ప్రభుత్వం ఉద్యోగులుగా నియమించాలని పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని, ఇతర అలవెన్సులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై సిఐటియు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందని వారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ నాయకులు అశోక యూనియన్ నాయకులు. సిహెచ్ వెంకటి మల్లికార్జున్, సైదులు, ఉప్పలమ్మ, మరియమ్మ కుమారి, చంద్రయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు



అమ్మ ఆదర్శ పనుల్లో నాణ్యత పాటించాలి

- జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కొనసా గుతున్న అమ్మ ఆదర్శ పనులలో నాణ్యత పాటించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మండ లంలోని దుబ్బతండ ప్రాథమిక పాఠశాలను, అనంతారం జెడ్పి ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీర్ ఇచ్చిన సూచనల ప్రకారం పనులు చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా టాయిలెట్లకు అమర్చిన డోర్లు, నల్లాలు, మోటార్ పైపులైన్ ను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటు హక్కును వినియోగి ంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈఓ ఎస్ రవి, ప్రధానోపాధ్యాయులు జమాల్ షరీఫ్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ కళా దినోత్సవం

నవతెలంగాణ-నేరేడుచర్ల



నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల మున్సిపా లిటీలోని రామాపురంలో ప్రపంచ కళా దినోత్సవ కార్యక్రమాన్నిమహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ బి వెంకటప్పయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు డ్రాయింగ్ చేసిన వివిధ కళాఖండాలను క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ రెడ్డి డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు, ఎల్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యాలు సృజనాత్మకత డ్రాయింగ్ చేయడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డ్రాయింగ్ టీచర్ ఓం ప్రకాష్, జడ్పీహెచ్ఎస్ నేరేడుచర్ల డ్రాయింగ్ టీచర్ పి నగేష్ లను ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ డ్రాయింగ్ పోటీలలో ఆరుగురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు కర్రి సూర్యనారాయణ రెడ్డి క్లబ్ సభ్యులు ఎం రవీందర్ రెడ్డి పాఠశాల ఏటీపీ బి ఉపేందర్‌రావు ఉపాధ్యాయులు నాగరాజు, సాయికుమార్ ,ఖాసీం ,మహేష్ పాల్గొన్నారు.

వెలవెలబోయిన మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-చిలుకూరు



సర్పంచుల పదవీకాలం పూర్తయిపోవడంతో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. సభను మండల ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య ప్రారంభించి మండలంలోని సమస్యలను ప్రతి ఒక్కరు తెలియజేయాలని వివరించారు. వివిధ హోదాల్లో ఉన్న అధికారులు మాట్లాడుతుండగా ఆయా గ్రామాల ఎంపీటీసీలు ఒకసారిగా మండలంలోని 17 గ్రామాలలో ఏ ఒక్క గ్రామానికి పల్లె వెలుగు బస్సులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణాన్ని అన్ని గ్రామాలకు బస్సుల ద్వారా కొనసాగించాలని కోరుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మందుల కొరత తీవ్రంగా ఉన్నదని వెటర్నరీ ప్రభుత్వ వైద్యశాలలో కూడా మందులు అందుబాటులో లేకపోవడంతో పశువులకు మనుషులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకొని త్రాగునీటి సమస్య ను అరికట్టాలన్నారు. మండలంలో రోడ్లు అధ్వానంగా తయారైనాయని నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదని తెలియజేశారు. సాగర్ నీటితో అన్ని గ్రామాల చెరువులను నింపాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో గిరిబాబు తాసిల్దార్ ధ్రువ కుమార్ జడ్పిటిసి బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు మండల కో ఆప్షన్ ఎస్కే జానీ మియా వివిధ హోదాలలో ఉన్న అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ గుండు రవి ఆదర్శప్రాయుడు

నవతెలంగాణ-కోదాడరూరల్

సీనియర్ ఫోటో గ్రాఫర్ గుండు రవి ఆదర్శప్రాయుడు అని స్థానిక ఫోటోగ్రాఫర్లు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ గుండు రవి సంతాప కార్యక్రమాన్ని పట్టణంలోని స్థానిక వర్తక సంఘం భవనంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఫోటోగ్రాఫర్లు వెళ్లి రవి చిత్రపటం వద్ద మౌనం పాటించి సంతాపం తెలిపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తాను నవ్వుతూ అందరినీ నవ్విస్తూ సరదాగా కళ్ళ ముందు రోజు తిరిగే రవి తిరిగిరాని లోకాలకు వెళ్లినందుకు ఫోటోగ్రాఫర్లు కన్నీళ్ళతో బాధ తప్త హృదయాలతో జోహార్లు అర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పిల్లుట్ల వెంకట్, మరికంటి లక్ష్మణ్, జాతీయస్థాయి ఫోటోగ్రాఫర్ బొమ్మల వెంకన్న, సీనియర్ ఫోటోగ్రాఫర్లు బసవయ్య సప్తగిరి, మయూరి రామకృష్ణారెడ్డి, నరసింహ, శేషు, ప్రభాకర్, యస్ యస్ శ్రీను, నరేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-పెన్‌పహాడ్




మండల పరిధిలోని అనంతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, సింగారెడ్డి పాలెం గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులు తమ ధాన్యం తీసుకువచ్చేటప్పుడు రైతుల తూర్పాలు పట్టుకొని తేమ 17 శాతం ఉండే విధంగా మట్టి పెల్లలు, బేరుకులు లేకుండా మంచి ధాన్యాన్ని తీసుకు వచ్చి గ్రేడ్ ఏ ధాన్యానికి మద్దతు ధర రూ.2203 మరియు కామన్ గ్రేడ్ రూ.2183 పొందవచ్చని తెలిపారు. రైతులతో మాట్లాడుతూ పండించిన వరి ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులందరూ విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద తరుగు రూపంలో రైతులను మోసం చేయవద్దని అన్నారు. అధికారులు రైతులపై పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి కృష్ణసందీప్, ఏఈఓ మనోజ్, సుష్మ, పిఎసిఎస్ సీఈవో సైదులు, ఐకెపి సంఘ బంధం లీడర్ శైలజ పాల్గొన్నారు.

నల్గొండ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి

- ఎన్ఎస్‌యుఐ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నవతెలంగాణ-సూర్యాపేట



నల్గొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీరారెడ్డిని లక్ష నలభై వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్ లో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుని బిజెపికి, టిఆర్ఎస్ కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అన్నారు. అలాగే కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఐదు లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని 10 లక్షలు చేసిందని ఇందిరమ్మ ఇళ్లులు ఇచ్చిందని మహిళలకు వడ్డీ లేని రుణాలను, వచ్చే రెండు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలను ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్ ఎస్ యు ఐ, యువత ఎంపీ ఎలక్షన్లో ముందు ఉండి విస్తృత ప్రచారం చేయాలని అభ్యర్థి ని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్ ఎస్ యు ఐ లో కష్టపడ్డ ప్రతి వ్యక్తికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. తాను కూడా ఎన్ ఎస్ యు ఐ నుంచి ఈరోజు ఎమ్మెల్సీ స్థానంలో ఉన్నాను అంటే దానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం మె అన్నారు. ఈ కార్యక్రమంలో ఒబిసి సెల్ విభాగం వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ అసెంబ్లీ నియోజకవర్గ ప్రెసిడెంట్ బంధం విష్ణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజబోయిన శ్రీకాంత్, టౌన్ ప్రెసిడెంట్ చింత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ను జయప్రదం చేయాలని విస్తృత స్థాయి సమావేశం

నవతెలంగాణ-తిరుమలగిరి



తిరుమలగిరి మండల కేంద్రంలో హమాలీ కార్మికుల ఆధ్వర్యంలో మేడే జయప్రదం చేయాలని విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సమావేశానికి జిఎంపిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య పాల్గొని ప్రసంగించారు. మే ఒకటవ తారీఖు నాడు కార్మికులు మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సందర్భంలో కార్మిక హక్కులను సాధించుకోవడం కోసం కార్మికులంతా ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. నిత్యవసర వస్తు ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్య కుటుంబాలపై భారం పడుతున్నది, ధరలు పెరుగుతున్నాయి తప్ప కార్మికుల శ్రమకు వేతనం మాత్రం పెరగటం లేదన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తించే విధంగా చూడాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పానగంటి శీను, గంట సోమయ్య, కాటమల్ల మాణిక్యం, గంట రవీందర్, గంట ప్రతాప్, గంట రాజు, కమ్మకూరి సుమన్, ఇందుకూరి రమేష్, కందుకూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన తలారి స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి స్వామి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్న రమేష్, పున్న నర్సింహ, తాటిపాముల శేఖర్ గౌడ్, నకరకంటి రవీందర్, దొమ్మటి లింగారెడ్డి, నిమ్మల మధు, కొరబోయిన నర్సింహ, తాటిపాముల లింగస్వామి, సాగర్ల సైదులు, గోధుమల సోమప్ప, పర్నె వెంకట్ రెడ్డి, కాట్రేగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను పార్లమెంటుకు పంపాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ప్రశ్నించే గొంతుక, పేదల కోసమే పని చేస్తున్న భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎండి జాహంగీర్‌ని గెలిపించి పార్లమెంటుకు పంపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌలు అన్నారు. ఆలేరు పట్టణంలో సోమవారం మార్కెట్ యార్డ్ ముందు ఇటుక బట్టి ట్రాక్టర్ల కార్మికులకుతో కలిసి జహంగీర్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల కోసం పనిచేసే జహంగీర్ గత 35 ఏండ్ల నుండి పేద ప్రజల కోసం పనిచేస్తున్నరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుగులోతు రమేష్, కేతవత్ దేవుల, లక్ష్మి, స్వప్న, మాలతో విజయ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బలమైన ప్రజాప్రతినిధులు లేకనే వెనుకబాటు

- ఆదరించి గెలిపించండి పార్లమెంటులో ప్రజల గొంతునవుతా
- ఇంటింటి ప్రచారంలో సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి జహంగీర్

నవతెలంగాణ-రామన్నపేట

బలమైన ప్రజాప్రతినిధులు లేకపోవడం మూలంగానే గత కొంతకాలంగా రామన్నపేట అభివృద్ధికి నోచుకోకపోగా పూర్వ వైభవాన్ని కోల్పోయిందని, ప్రజలు సీపీఐ(ఎం)ని ఆదరించి భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి అత్యధిక నిధులు రాబట్టి అభివృద్ధికి తోడ్పడతానని సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి జహాంగీర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక సీపీఐ(ఎం) నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని ఓటు వేయమని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నియోజకవర్గంగా ఉన్న రామన్నపేట నుండి బలమైన ప్రజా ప్రతినిధులు లేక ప్రాంతం వెనకబడి పాలకుల నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆవేదన



వ్యక్తం చేశారు. యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి శిథిలావస్థకు చేరిందన్నారు. కనీసం డాక్టర్లు లేని దుర్భర పరిస్థితి నెలకొన్నదన్నారు. మెరుగైన వైద్యం అందక అనేక మంది చనిపోతున్నారు. మూసీ కాలుష్యపు కోరల్లో ప్రజల భవితవ్యం చిక్కుకుందన్నారు. పండించే పంట, తినే తిండి అత్యంత ప్రమాద రసాయనాలతో నిండి ప్రజలు ప్రాణాంతక రోగాల భారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో రోడ్డు రవాణా వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందన్నారు. కనీసం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించే పరిస్థితిలో పాలకులు లేరని ఆయన ఆరోపించారు. మూడు దశాబ్దాలుగా రామన్నపేట ప్రాంత ప్రజల పక్షాన నిలబడి అనేక పోరాటాలు నడిపిన తనకు పార్లమెంటు సభ్యుడిగా అవకాశం ఇస్తే రామన్నపేట ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు పైళ్ళ ఆశయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేక అశోక్ రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వనం ఉపేందర్, గాదె నరేందర్, బోయిని ఆనంద్, వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్, మామిడి వెంకట్ రెడ్డి, కందుల హనుమంతు, గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, ఎండి రషీద్ పాల్గొన్నారు.

యూరో కిడ్స్ ప్లే ఏసీ క్యాంపస్ ప్రారంభం



నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పట్టణంలో అత్యాధునిక సదుపాయాలతో యూరోకిడ్స్‌ప్లే ఏసీ క్యాంపస్‌ను వినియోగించుకోవాలని ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త లింగ నరసింహారావు కోరారు. సోమవారం పట్టణంలోనికి సన్‌నగర్‌లో యూరో కిడ్స్ ప్లే ఏసీ క్యాంపస్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో మొట్టమొదటిసారిగా ఏసీ క్యాంపస్‌ను ప్రారంభించిన విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డిని అభినందించారు. విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, యూరో కిడ్స్ ప్లే చైర్మన్ డాక్టర్ పగిడాల జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన ప్లేవే మెథడ్ ద్వారా మరియు టెక్నాలజీ పరంగా ఆడియో మరియు వీడియో విజువల్ ద్వారా విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పగిడాల పురంధర్ రెడ్డి, ఎంపల్ల బుచ్చిరెడ్డి, గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి, జైని రవీందర్ గుప్తా, కళ్లెం రఘుపతి రెడ్డి, పగిడాల రామ్ రెడ్డి, కొమ్మిడి కరుణాకర్ రెడ్డి, బంధుమిత్రులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమాలే ఊపిరిగా జీవిస్తున్న జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దూపటి వెంకటేష్

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఉద్యమాలే ఊపిరిగా జీవిస్తూ, నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వారి మధ్యన నిలిచి పనిచేస్తున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండి జహంగీర్ కు ప్రజలు ఓటు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ అన్నారు. సోమవారం ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో జహంగీర్‌ను గెలిపించలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూపటీ వెంకటేష్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ధర్నాలు నిర్వహించి ప్రభుత్వాల దృష్టికి తీసుకుపోయి, అట్టి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటాలు చేసిన చరిత్ర జహంగీర్‌ది అన్నారు. జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకే ఓటు వేసి, ప్రతి ఇంటి నుండి ఎన్నికల నిర్వహణ కొరకు నోట్ కూడా ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శి చౌడబోయిన యాదగిరి, పారుపల్లి సత్తయ్య, చౌడ బోయిన సుధాకర్, దండు ఐలయ్య, కరుణాకర్, నర్సయ్య, మాధవి, కవిత,మల్లమ్మ,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..



మండల వ్యాప్తంగా సొసైటీ, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాన్ని రైతుల నుండి వేగవంతంగా కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దూపటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో పటేల్ గూడెం గ్రామంలోని సొసైటి ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్న మార్కెట్ కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ..గత 15 రోజులుగా రైతులు ధాన్యం అమ్మకానికి ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు పలాన రోజు ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేస్తామనీ నేటికి స్పష్టంగా తేదీని ప్రకటించకపోవడం చాలా దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే.. ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ ఎంపార్ల మెంట్ అభ్యర్థి జహంగీర్‌కు ఓటు వేసి గెలిపించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు నల్లమాస తులసయ్య, పిక్క గణేశ్, నిదిగొండ వాలి, గ్యార భాస్కర్, కొండం సుధాకర్ రెడ్డి, గ్యార ప్రశాంత్, రాజు, బంద్రు ఐలయ్య, సిద్దమ్మ రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా మధుకర్

నవతెలంగాణ-రామన్నపేట

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రామన్నపేట మండల కొమ్మాయి గూడెం గ్రామానికి చెందిన బండ మధుకర్ రెడ్డినీ నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. అనంతరం బండ మధుకర్ రెడ్డి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్, మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపు కోసం కృషి చేస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



ముగిసిన ఎల్లగిరి క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం ఎల్లగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గత నెల రోజులు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం తో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌కి మొదటి నగదు బహుమతి దాతగా ఖురేషి ట్రేడర్స్ ఓనర్ మహమ్మద్ ఖలీల్ కొత్త శ్రీశైలం యాదవ్ రూ.66,789/ మొదటి బహుమతిగా అందజేశారు. ద్వితీయ బహుమతిగా శ్రీకర ఇన్ఫ్రా డెవలపర్స్ ఓనర్ గోపాల శ్రీశైలం యాదవ్ రూ.30,000 నగదును అందజేశారు. అదేవిధంగా ఎల్లగిరి మాజీ ఉప సర్పంచ్ కందగట్ల పద్మారెడ్డి షీల్డ్‌లను అందజేశారు. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ విజేతలుగా అంజన్న వారియర్స్ మొదటి బహుమతిని గెలుపొందగా ద్వితీయ బహుమతిని గణపతి బోర్ వెల్స్ గెలిచారు. ఈ కార్యక్రమంలో ఎల్లగిరి గ్రామ మజీ సర్పంచ్ రిక్కల ఇందిరసత్తిరెడ్డి మాజీ ఉప సర్పంచ్ సాయిరెడ్డి బుచ్చిరెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యులు రిక్కల జంగారెడ్డి,కొత్త పర్వతాలు యాదవ్ నాయకులు వెంకట్ రాంరెడ్డి,బాలకృష్ణ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, రిక్కల మహేందర్ రెడ్డి, కందగట్ల జంగారెడ్డి, మారగొని కోటి తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి బెదిరింపులు సరికాదు'

నవతెలంగాణ-ఆలేరుటౌన్

నార్మల్, మదర్ డెయిరీ అధికారులపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడడం సరికాదని, మండలంలోని గుండ్లగూడెం పాలసంఘం చైర్మెన్ మైదం రంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారం ఉందని డెయిరీ ఎన్నికలు జరగకుండా నిలిపివేయడం సరికాదన్నారు. ఒక వైపు కాంగ్రెస్ పార్టీ వారు ఎన్నికలు నిర్వహించాలని చెబుతూ మరో వైపు జరగకుండా నార్మల్ మదర్ డెయిరీ అధికారులను బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-వలిగొండ

మండల కేంద్రంలో వలి భాష పేరున హజామ్ కుటుంబం సౌజన్యతో చలివేంద్రకేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీసీ సంఘం స్థాయిని యాదగిరి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బత్తిని బిక్షపతి గౌడ్ గంజి మహేష్ గంజి తిరుమలేష్ మచ్చ గిరి ఫరీద్ గౌస్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఐరన్ గ్రిల్ గేట్ల బహూకరణ

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969-70 ఎస్ఎస్సి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు, వారి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయం మేరకు, మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతుల రక్షణ కొరకు తరగతి గదులకు రూ.20వేల విలువైన ఐరన్ గిల్ గ్రిల్ గేట్లను ఏర్పాటు చేశారని ప్రధానోపాధ్యాయులు బూరుగు మహేందర్‌రెడ్డి తెలిపారు. ఇట్టి విరాళానికి కృషిచేసిన ఆ బ్యాచ్ విద్యార్థి విశ్రాంత మండల విద్యాధికారి బల్ల దామోదర్ కి మరియు ఆ బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు

గురుకుల హాస్టల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-భువనగిరి

విద్యార్థుల ఆహార ఏర్పాట్లలో అలసత్వం వహించిన భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్ అధికారులపై, సిబ్బందిపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు మాట్లాడారు. భువనగిరి గురుకులంలో సుమారు 600లకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు విద్యార్థులకు సరిపడా గదులు లేక ఎరుకు గదుల్లోనే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన భోజనము విద్యార్థులకు అందించడం లేదన్నారు. భువనగిరి గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తినడంతోనే ఫుడ్ పాయిజన్‌తో వాంతులు విరోచనాలు చేసుకున్నారని తెలిపారు. ఈ సమస్యలను ముందుగా గుర్తించి ఎస్ఎఫ్ఐ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో పరిరక్షణకై సమరభేరి సైకిల్ యాత్ర నిర్వహించిందని తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో హాస్టల్లో సమస్యలపైనే అధ్యయనం చేసి వచ్చిన సమస్యలను కలెక్టర్‌కి, గురుకుల హాస్టల్ అధికారులకు వినతిపత్రం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలన్నారు. అధికారులు హాస్టల్‌లను తనిఖీలు చేయకుండా కాలం గడుపుతున్నారు. విద్యార్థులకు నాణ్యతమైన భోజనం అందించాలని పెరుగుతున్న ధరలు అనుగుణంగా పెంచిన మెస్ కాస్మోటిక్ చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి విద్యార్థులు అనారోగ్యానికి కారణాలను పరిశీలించి సంబంధిత అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

వామపక్షాల కృషి వల్లే ఉపాధి హామీ చట్టం



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

వామపక్షాల కృషి వల్లే ఉపాధి హామీ చట్టం కొనసాగుతోందని, భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అల్లందేవి చెరువు గ్రామ పరిధిలోని కొత్తచెరువులో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసున్నారు. పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పని చేసిన వారంలోపు కూలీ డబ్బులు చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికీ నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 లు కొలతలతో నిమిత్తం లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో సిపిఐ(ఎం) అభ్యర్థులు ఉంటే కూలీల పక్షాన పోరాడుతారన్నారు. పోరాడే ప్రజా నాయకులను గెలిపించాలన్నారు. ప్రస్తుత కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వము ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తు బడ్జెట్లో నిధులు తగ్గించిందన్నారు. కూలీల పక్షాన నిరంతరం పోరాడే జాంగిర్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు జనిగల నరసింహ, అల్లం దేవి చెరువు గ్రామ శాకా కార్యదర్శి గంగాదేవి భిక్షం, గుండు దశరథ, గుండు లింగస్వామి, గుండు జంగయ, మాజీ వార్డ్ మెంబర్ గుండు జయమ్మ జనిగలయాదయ్య, ఉప్పల పెళ్లి భారతమ్మ, గుండు మంగమ్మ అంతటి జంగమ్మ ఏర్పుల సాలయ్య గుండు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఏ-గ్రేడ్‌లో కొనుగోలు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

వరి ధాన్యాన్ని ఏ గ్రేడ్ కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు సీపీఐ(ఎం) తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పోచంపల్లి మండల ప్రాంతాన్ని మూసి పరివాహక ప్రాంతం పేరుతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. మండలంలో 75శాతం మంది రైతులు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని మండల వ్యాప్తంగా 27 వేల ఎకరాల భూమిని సాగు చేస్తున్నారని రైతులు పండించిన పంట 7 లక్షల క్వింటాల వరకు ధాన్యాన్ని పండిస్తున్నారు. అట్టి ధాన్యాన్ని మూసి పరివాహక ప్రాంతం పేరుతో బి గ్రేడ్ గా కొనుగోలు చేస్తూ ప్రభుత్వం రైతాంగానికి తీవ్రనష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని ఏ గ్రేడ్ గా కొనుగోలు చేయకుంటే పెద్ద ఎత్తున



ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు లింగారెడ్డి సిఐటియు మండల కన్వీనర్ మధు డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్ నాయకులు,వాకిటి పద్మారెడ్డి, గుణం వారి మల్లారెడ్డి, పురుషోత్తమ రెడ్డి, యాదగిరి, జంగారెడ్డి నర్సిరెడ్డి, నరసింహ, వెంకటరెడ్డి. పెంటయ్య, మాజీ సర్పంచ్ బొడిగే శంకరయ్య, సహోదన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాష్ రెడ్డి సత్తయ్య, బల్ రెడ్డి, శివకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

హెల్ప్ డెక్స్ సేవల పట్ల అవగాహన ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె జెండగే



నవతెలంగాణ-భువనగిరి

నామినేషన్ల స్వీకరణ, హెల్ప్ డెస్క్ సేవల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి వుండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్లు, ఎన్‌కోర్, హెల్ప్ డెస్క్ టీముల అధికారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నామినేషన్స్ ప్రక్రియలో పరిశీలన, తిరస్కరణ ముఖ్యమైన అంశాలైనందున సరైన అవగాహన పొందాలన్నారు. హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్లు, డిపాజిట్లు, ప్రపోజర్స్, గుర్తుల కేటాయింపు, ఫామ్ -26 సంబంధించిన విషయాలు, నోటరీ విషయాలపై సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. హెల్ప్ డెస్క్‌లో 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఓటరు జాబితాలతో ఉండాలని, అభ్యర్థుల ప్రమాణంపై, చెక్ లిస్ట్ ప్రకారం నామినేషన్ల ప్రక్రియపై పూర్తి అవగాహన పొందాలని సూచిస్తూ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ వేసే వారు జనరల్ కేటగిరీలో 25 వేలు, ఎస్.సి., ఎస్.టి. కేటగిరీలో 12 వేల 500 డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ కె.నర్సిరెడ్డి, ఆర్.హరినాథరెడ్డి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, భువనగిరి ఆర్.డి.ఓ. అమరేందర్, తహశీలుదార్లు, డిప్యూటీ తహశీలుదార్లు పాల్గొన్నారు.

ఉచితాలొద్దు.. ఉపాధి అవకాశాలు కల్పించాలి

- పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ ఎంపీ అభ్యర్థి సదానంద రెడ్డి

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

ఉచిత పథకాలు వద్దని, ఉపాధి అవకాశాలు ఉద్యోగ భద్రత కల్పించాలని పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి సదానంద రెడ్డి అన్నారు. సోమవారం పోచంపల్లి మండలంలోని గ్రామాలలో ప్రచారం చేస్తూ ప్రజలకు కావలసినవి ఉచితాలు వ్యసనాలు కాదని, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కావాలన్నారు. ఈ సందర్భంగా సదానంద రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను వంచనకు, మోసానికి గురిచేయటమే కాక, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, యువతి యువకులను నిరుద్యోగులుగా నడిరోడ్డుపై నిలబెట్టడం జరిగిందన్నారు. కావున ఇలాంటి దుస్థితి ఉత్పన్నం కాకుండా ఉండాలంటే పీపుల్ ప్రొటెక్షన్ పార్టీకి అందరి మద్దతు కావాలన్నారు.

అణగారిన జీవితాలకు అక్షరధారులు అంబేద్కర్, పూలే

నవతెలంగాణ-రామన్నపేట



అణగారిన జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయులు జ్యోతీరావు పూలే, అంబేద్కర్‌లు అని తెలంగాణ సాహితీ హైదరాబాద్ నగర అధ్యక్షులు, కవి ఏబూషి నర్సింహ్మ అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విజ్ఞాన కేంద్రం భవనంలో జ్యోతిరావు పూలే-అంబేద్కర్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్ కు ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. చదువు అందరి హక్కు అని క్రింది వర్గాలకు చదువును అందించి చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించారన్నారు. నేటి యువత పూలే, అంబేద్కర్ మార్గాన్ని అనుసరించి నయా ఆదిపత్యాన్ని దునుమాడేందుకు కంకనబద్దులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు బొడ్డుపల్లి వెంకటేశం, గంటెపాక శివ కుమార్, తొలుపునూరి చంద్ర శేఖర్, గాదె శోభారాణి, యాదాసు దుర్గయ్య, జంపాల అండాలు, నోముల రమేష్, భూడిద భిక్షం, మేడి బాషయ్య, గంటెపాక శ్రీధర్, జంపాల దినేష్, బత్తిని సందిప్ తదితరులు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

భవననిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్ డిమాండ్ చేశారు. పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని తాపీ సంఘం భవనంలో ఈ నెల 5వ తేదీన జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన నూతన కమిటీకి సోమవారం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఇమ్రాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్ళు వయస్సు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న క్లైయిమ్స్ మరియు ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన భవన నిర్మాణ కార్మిక కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులుగా చేరాల లింగయ్య, ఉపాధ్యక్షునిగా దేవిగారి బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా కొత్త నరేష్, సహాయ కార్యదర్శిగా రామచర్ల సందయ్య, కోశాధికారిగా పోతగళ్ల బాలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, పెద్దల యాదయ్య, తదితర 50 మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-రాజపేట

రాజాపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచి బిఆర్ఎస్ నాయకురాలు వస్పరి ధనలక్ష్మి విష్ణు దంపతులు తన అనుచర వర్గంతో సోమవారం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో శ్యామల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వస్పరి శ్రీనివాస్, బయన్న, సిద్దులు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
మంగళవారం | ఏప్రిల్ 16 . 2024 | www.navatelangana.com

మున్సిపల్ నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గా శాగంటి అనసూయ రాములు, వైస్ చైర్‌పర్సన్‌గా కేసిడి సరళ యాదవ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుంకరి జనార్దన్, తుంగతుర్తి నియోజకవర్గ మీడియాఇన్‌చార్జి కందుకూరి లక్ష్మయ్యలు వారిరువురిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన చైర్మెన్ చాగంటి అనసూయ మాట్లాడుతూ అందరి సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజినీకాంత్ రెడ్డి, కిషట్ల నాయక్, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి అమ్మనబోలు ఎంపీటీసీ కొంపెల్లి సైదులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హోటల్ వివేరా లో వినతి పత్రం అందజేశారు. చేనేత త్రిఫ్ట్ పథకం 40శాతం సబ్సిడీ కొనసాగించాలని, జియోటాక్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికిఅంత్యోదయ కార్డు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదికా నల్లగొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి వెంక టేశ్వర్లు, కెన్నటి పరుషరాములు వెంకటేశ్వర్లు మిడిదొడ్డి రాజు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



యాసంగి ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. సోమవారం తన చాంబర్లో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాలు, మార్కెటింగ్ తదితర అందిత శాఖల అధికారులతో యాసంగి ధాన్యం సేకరణపై సమీక్షించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం మొత్తం వివరాలను సమీక్షించడమే కాకుండా, ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతు ఖాతాలో తక్షణమే డబ్బులు జమ అయ్యే ప్రాసెస్ కు సంబంధించి అన్నిస్థాయిల్లో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ జాప్యం లేకుండా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిల్లర్లు ప్రభుత్వం సూచించిన విధంగా జాప్యం లేకుండా సీఎంఆర్ ధాన్యాన్ని ఇవ్వాలన్నారు.ట్రక్ షీట్ తో పాటు, ఎఫ్ఏ క్యూ రిపోర్టు కచ్చితంగా ఉండేలా ఏఈఓలు చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ట్రక్ షీట్ తెప్పించుకొని సాధ్యమైనంత త్వరగా ట్యాబ్ లో అప్లోడ్ చేయాలని ఈ విషయంలో ఎవరు ఆలస్యం చేయొద్దన్నారు. తాలు విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. మిల్లర్లు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని,తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నీడ, త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టార్పాలిన్లను రెడీగా ఉంచాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడి శ్రీకాంత్, సివిల్‌సప్లై డిఎం నాగేశ్వరరావు, డీసివో, కిరణ్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా

నవతెలంగాణ-చౌటుప్పల్



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహా కోరారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిగూడెంలో ఆ పార్టీ శాఖ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, యువకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం జహంగీర్ అలుపెరగని పోరాటాలు నిర్వహించారన్నారు. బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జహంగీర్ 35 ఏళ్లుగా సీపీఐ(ఎం)లో నిస్వార్థంగా పనిచేస్తూ అను నిత్యం పేదలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే విధంగా పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామశాఖ కార్యదర్శి ఉష్కాగుల శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, పెద్దవెంకటేశం, తొర్పునూరి మల్లేశ్‌గౌడ్, బొమ్మిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సుర్కంటి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ బిఎస్.లత

నవతెలంగాణ- తుంగతుర్తి



పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తున్న దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ సరైన మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ బిఎస్. లత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లకు, సెక్టోరియల్ ఆఫీసర్స్,స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు నిర్వహించిన ఎన్నికల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగుల కోసం ర్యాంపులు, మంచినీరు టాయిలెట్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించిన స్పష్టమైన నివేదిక సత్వరమే సమర్పించాలన్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి ఆ సమాచారాన్ని అధికారులకు చేరవేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ అవసరమైన వసతులు కల్పించేందుకు ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ తీసుకోవలసిన చర్యల గురించి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు సెక్టోరియల్ ఆఫీసర్స్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న వసతులను సమీక్షించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిపేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదన్నారు. ఎన్నికల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే అవి అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు .ఈ సమావేశంలో తహసీల్దార్ రమణారెడ్డి తో పాటు వివిధ మండలాల తాసిల్దారులు. ఎస్ హెచ్ ఓ లు సెక్టర్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐకెపి కేంద్రాలలోని ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. ఈ మేరకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాలలోనే మద్దతు ధర లభిస్తుందని సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సీసీ గడ్డం గిరి ధాన్యం కొలుగోరు కేంద్ర నిర్వాహకులు తదితరులు కలరు.

19న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ నామినేషన్

- రైల్వే స్టేషన్ నుండి భారీ ర్యాలీ, అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్ షో
- హాజరుకానున్న బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ ఏప్రిల్ 19న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి జగదేపూర్ చౌరస్తా వద్ద వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నామినేషన్ ర్యాలీకి సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములతో పాటూ కేంద్ర, రాష్ట్ర నాయకులు పలువురు హాజరుకానున్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ రోడ్ షోకు భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ కార్యకర్తలు ప్రజలు తరలి రానున్నారు. అభ్యుదయవాదులు, ప్రజాతంత్ర వాదులు తరలిరావాలని సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్ విజ్ఞప్తి చేశారు. భువనగిరిలో సీపీఐ(ఎం) పోటీ చేయడాన్ని స్వాగతిస్తూ కవులు, కళాకారులు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ వాదులతో పాటు కార్మికులు మద్దతు పలుకుతున్నారని తెలిపారు.

విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె జెండగే

నవతెలంగాణ-భువనగిరి

పరీక్షలకు సంబంధించి వసతి గృహాల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టరు హనుమంతు కే జెండగే సంక్షేమ అధికారులకు సూచించారు. సోమవారం కాన్ఫరెన్స్ హాలులో సంక్షేమ, గురుకుల వసతి గృహాల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, మంచి భోజన వసతి ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు తరగతుల బోధన ఉండాలని, పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, వేసవి దృష్ట్యా ఎండమేడిమి తట్టుకునేలా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఏ చిన్న సమస్య కూడా రాకుండా ప్రిన్సిపల్స్, వార్డెన్స్ పరిశీలించేలా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి సూక్ష్మస్థాయి పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ చందనా దీప్తి

నవతెలంగాణ-నల్లగొండటౌన్



పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల దాఖల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్నాయని, రాజకీయ పార్టీ నాయకులు నామినేషన్ దాఖల సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నడుచుకోవాలని సోమవారం జిల్లా ఎస్పీ చందన దీప్తి తెలిపారు. అభ్యర్థి ఊరేగింపుతో నామినేషన్ దాఖల సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి మరియు శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ఏర్పాట్లను చేయడానికి పోలీసు అధికారులకు ముందుగా తెలియజేయాలన్నారు. అభ్యర్థి ఊరేగింపు ర్యాలీ నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ కార్యాలయం నుండి 100 మీటర్ల దూరం వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి రావడానికి వాహనాల గరిష్ట సంఖ్య 3కి మాత్రమే పరిమితం చేయబడింది మరియు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి ప్రవేశించడానికి ముందుగానే నామినేషన్ పత్రాలు నింపుకొని అభ్యర్థి తో సహా 5 గురికీ మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థి వాహనాలకి రిటర్నింగ్ అధికారి నుండి ముందస్తు అనుమతి పొందల్సి ఉంటుంది , రిటర్నింగ్ అధికారి జారీ చేసిన పర్మిట్‌ను ఒరిజినల్ కాపీ ప్రదర్శించాలన్నారు. వాహనం విండ్‌స్క్రీన్‌పై పర్మిట్ వాహనం నంబర్,అభ్యర్థి పేరు ఎవరికి అనుకూలంగా జారీ చేయబడిందో తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఒక అభ్యర్థి పర్మిట్ తీసుకున్న వాహనం మరొక అభ్యర్థి ఉపయోగించరాదని పేర్కొన్నారు. పై నిబంధనలను ఉల్లంఘిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం సెక్షన్ 188 IPC, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 129 ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.

వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులైతే తల్లిదండ్రులుపై చర్యలు తప్పవు

మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులైతే తల్లిదండ్రులుపై చర్యలు తప్పవని, మైనర్లు వాహనాలు ఇవ్వకుడదని జిల్లా ఎస్పి చందనా దీప్తి సోమవారం హెచ్చరించారు. జిల్లా లో ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ లైసెన్స్ లేకుండా నడుపుట, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్లేకుండా నడుపుట,సెల్ ఫోన్ డ్రైవింగ్,డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటి వాటిపై ప్రతి రోజూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.అతివేగంతో అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురి కాకూదని పేర్కొన్నారు.ఎవరైన పిల్లలు నిబంధనలు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని అన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులైతే మోటర్ ఆక్ట్ ప్రకారం పిల్లల పైన Sec 181 మరియు తల్లితండ్రుల పైన Sec 180/177 ప్రకారం చర్యలు తీసుకోబడునని అన్నారు.



కొత్త బస్టాండ్ దగ్గర మురుగు కాల్వను వెంటనే మూసివేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహం దగ్గర ఉన్న మురికి కాల్వను వెంటనే మూసివేయాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో కాల్వను పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3,4 సంవత్సరాలు నుండి బస్టాండు సెంటర్లో ఈ కాలువను ముసివేయకుండా అలాగే ఉంచుతున్నారన్నారు.ఈ కాల్వ సూర్యాపేట బస్టాండ్ చౌరస్తాలో ఉండటం ఇక్కడ ఎప్పుడు జనసంచారం, వాహనాలతో రద్దీగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా దీని పక్కనే అనేకమంది బతుకుదెరువు కోసం చిన్నచిన్న టిఫిన్ సెంటర్లు,పాన్ షాపులు, టి స్టాళ్లు పెట్టుకొని జీవిస్తున్నా పట్టించుకోకుండా, రోడ్డు వెడల్పు చేసినప్పుడు ఈ కాల్వను మూయకుండా అలాగే ఉంచి వివిధ కారణాలు చూపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్,ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వీరబోయిన రమేష్,పార్టీ డివిజన్ నాయకులు సయ్యద్,వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పోరాడే జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య

నవతెలంగాణ-వలిగొండ రూరల్



నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడుతున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య ప్రజలను కోరారు.సోమవారం పొద్దుటూరు గ్రామంలో జహంగీర్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా నేటికీ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. మూసి పరివాహక ప్రాంతంలో కాలుష్య సమస్యతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, మూసి జల కాలుష్యాన్ని అరికట్టాలని మూసి పరివాహక ప్రాంతంలో గోదావరి జలాలను అందించాలని కోరారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఉందని ప్రజల కోసం పోరాడే వారికి అవకాశం ఇస్తే సమస్యలు పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించి సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కమిటీ సభ్యులు ఏలే కృష్ణ, శాఖ కార్యదర్శి పలుసం లింగం, సీనియర్ నాయకులు పలుసం బాలయ్య, గొలను కొండోజు స్వామి, పెద్దబోయిన కాంతయ్య, బత్తుల నరసింహ, పెద్దబోయిన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

- జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమ నరసయ్య

నవతెలంగాణ-సూర్యాపేట



శ్రీరాముని దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇమ్మడి సోమ నరసయ్య తెలిపారు. సోమవారం స్థానిక బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరం ప్రాంగణంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వేదాంత భజన మందిరంలో గత 75 సంవత్సరాలుగా శ్రీరామనవమి ఉత్సవములు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు.నవరాత్రుల సందర్భంగా జరుగు అన్నప్రసాద కార్యక్రమానికి సంపూర్ణ అన్నదాతగా వ్యవహరిస్తూ 10 క్వింటాల బియ్యాన్ని ఆయన విరాళంగా ప్రకటించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ పంచ సూక్త సహిత మూల మంత్ర మహా పూర్ణాహుతి కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష కార్యదర్శులు రాచర్ల వెంకటేశ్వరరావు, నకరి కంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మొరిశెట్టి శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కక్కిరేణి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు మీలా వంశీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు సూర్యాపేట తాలూకా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బోనాల రవీందర్, కొత్త ఆంజనేయులు, పోతుగంటి నరసింహారావు, చల్లా అశ్విని కుమార్, గజ్జల జనార్దన్,జక్కుల గిరికుమార్, యామా శ్రీనివాసులు,వాసా కృష్ణ,సోమా సుమన్,షీలా శంకర్, మందిర అర్చకులు దరూరీ సింగరాచార్యులు,రాఘువ చార్యులు, రాచర్ల ప్రేమలత, నకరికంటి హైమావతి,సోమా శోభ, కొత్తూరు స్వాతి తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి రూ. 2.5 లక్షల విరాళం

నవతెలంగాణ-నూతనకల్

మండల విశ్రాంత ఉద్యోగులు నూతనంగా నిర్మాణం చేపట్టే భవనానికి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ సినిమా ఆటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇచ్చిన రెండున్నర లక్షల ఆర్థిక సహాయాన్ని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ తీగల గిరిధర్ రెడ్డి సోమవారం మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు భవన నిర్మాణం మధ్యలో ఆగిపోగా ఎంపీగా ఉన్న సమయంలో విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు కలిసి ఆర్థిక సహాయాన్ని కోరగా స్పందించన మంత్రి విరాళం అందజేశారని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం లో ప్రజల అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి భారీగా సహాయం చేస్తున్నారని తెలిపారు ఇటీవల తిరుమలగిరి మండల పరిధిలోని గుండెపురి లో అనారోగ్యం మృతి చెందిన వెంకన్న కుటుంబానికి లక్ష రూపాయలు మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం లో ఇల్లు దగ్ధమై మృతి చెందిన కుటుంబానికి రెండు లక్షల రూపాయలు అందజేసి మంత్రి తన దాతృతీని చాటారని తెలిపారు.,,, మంత్రి ఆర్థిక సహాయం పట్ల హర్షం,, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విశ్రాంతి ఉద్యోగులు నూతనంగా చేపట్టే భవన నిర్మాణం అడిగిన వెంటనే రెండున్నర లక్షలు ఆర్థిక సహాయం పట్ల విశ్రాంతి ఉద్యోగుల మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేసారు.

వైభవంగా గ్రామోత్సవం

నవతెలంగాణ- నేరేడుచర్ల

పట్టణంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ప్రతిష్టించే ధ్వజస్తంభానికి సోమవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో దాతల సహకారంతో సుమారు రూ 2 కోట్లతో నిర్మించిన కోదండ రామాలయం లో ఈనెల 19, 20, 21 తేదీలలో ఆలయ విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనేపద్యంలో వరంగల్ పట్టణం పైడిపల్లి లో తయారు చేయించిన రాతి శిలా ధ్వజస్తంభాన్ని పట్టణానికి తీసుకురాగా ఘన స్వాగతం పలికారు. అనంతరం నేరేడుచర్ల పట్టణంలోని ప్రధాన వీధులలో మేళ తాళాలతో, నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ , పుర ప్రముఖులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన రైస్ మిల్లర్ల అసోసియేషన్ నూతన కమిటీ



నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేట తాలూకా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నూతనంగా ఎన్నికయిన కమిటీ సభ్యులు సోమవారం స్థానిక మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శాలువాతో సన్మానించి స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల కోసం ఎలాంటి అవినీతికు తావు లేకుండా సేవలు అందించాలని తెలిపారు. కలిసినవారిల రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బోనాల రవీందర్,ఉపాధ్యక్షులు కక్కిరేణి చంద్ర శేఖర్,కార్యదర్శి కొత్తా ఆంజనేయులు, సహయ కార్యదర్శి పోతుగంటి నరసింహరావు, కోశాధికారి చల్లా అశ్విన్ కుమార్ తదితరులు ఉన్నారు.

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా వెంకటేష్

నవతెలంగాణ-రాజపేట



మండల కేంద్రానికి చెందిన మార్త వెంకటేశం యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారిగా కొనసాగుతున్న ఆయనను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. రాజపేట శ్రీ మణికంఠ రైస్ మిల్ మేనేజింగ్ పార్ట్నర్ గా, రాజాపేట కన్యకా పరమేశ్వరి బిన్నీ రైస్ మిల్ ఫౌండేషన్ పార్ట్నర్, శ్రీ కన్యకా పరమేశ్వరి పారాబైల్డ్ రైస్ మిల్ కోనూరు మేనేజింగ్ పార్ట్నర్ గా ఆయన కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్, రాజపేట మండల ఆర్యవైశ్యులు, ప్రధాన కార్యదర్శి ఉప్పల సిద్ధి లింగం, యువజన విభాగం అధ్యక్షులు నంగునూరు రాజు, శ్రీ రామకృష్ణ మందిరం ఆలయ ట్రస్ట్ సభ్యులు అభివృద్ధి సేవా సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేసి మార్త వెంకటేశను అభినందించారు. సోషల్ మీడియా ద్వారా అన్ని పార్టీల నాయకులు పలువురు అభినందించారు.



ప్రశ్నించే గొంతుక జహంగీర్‌ను గెలిపించాలి

- జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు చెరుకు ఏక లక్ష్మి

నల్లగొండడెస్క్ :ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుక సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చెరుకు ఏకలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం అర్వపల్లి మండలలోని తిమ్మాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రగల్బాలు పలుకుతోందన్నారు. బీజేపీ పదేండ్ల పాలనలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుల బతుకులు భారంగా మారాయన్నారు .ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టి నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని తెలిపారు.రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడిం చాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్లంల ఐలయ్య, గ్రామ కార్యదర్శి మద్ది రాజయ్య ,పాల్గొన్నారు.

నవతెలంగాణ

నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి

మంగళవారం | ఏప్రిల్ 16. 2024 | www.navatelangana.com

మృతురాలి కుటుంబానికి సాయం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలో ఇటీవల జంగాల కాలనీకి చెందిన తూర్పాటి ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం పీఏసీఎస్ వైస్ చైర్మెన్ చంద్రకళ, లయన్ డాక్టర్ చింతకింది మురహరి దంపతులు మృతురాలి కుటుంబానికి యాభై కిలోల బియ్యం పంపిణీ చేశారు. సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అగ్నిప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ అగ్నిమాపక కేంద్రం ఇన్‌ఛార్జ్ అనిల్‌కుమార్, జితేంద్రకుమార్, ప్రసాద్, పాండు, భాగ్యనాయక్, నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

నవతెలంగాణ-భువనగిరి



రాష్ట్రంలో అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టించిందని పరుష పదజాలంతో మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం భువనగిరి పట్టణంలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాలులో భువనగిరి పార్లమెంటుస్థాయి బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్పు తెస్తామని అంటే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. అది వాస్తవమని రైతుల పంటలు ఎండిపోతున్నాయని దొంగతనాలు పెరిగిపోతున్నాయని, హామీలు అన్నీ అమలు కావడం లేదని ఎద్దేవా చేశారు. జిల్లా మంత్రి కుక్క లెక్క మొరుగుతూ నెల రోజుల నుండి కనబడటం లేదన్నారు. రైతులకి మోకం చాటేసి తిరుగుతున్నాడన్నారు. మిర్యాలగూడ లో వడ్ల కొనుకోలు మిల్లర్లపై చర్యలు గురించి కలెక్టర్‌కి ఆదేశాలు ఇచ్చారని అది ఏం అయిందని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలన్నారు. బిఆర్ఎస్ తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని క్యా మ మల్లేష్ ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి టిఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దక్కాలంటే బిఆర్ఎస్‌కు ఓటేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం కొరకు టిఆర్ఎస్ పేగులు తెగేవరకు పోరాడి సాధించుకున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గాదారి కిషోర్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొలుపుల అమరేందర్, గ్రంథాలయ సంస్థల చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, జడ్పీటీసీలు ఎంపీటీసీలు, , కౌన్సిలర్ల పాల్గొన్నారు.



చామల గెలుపు కోరుతూ ఎమ్మెల్యే బీర్ల ప్రచారం

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు. సోమవారం చామల గెలుపు కోరుతూ పట్టణంలో ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వినూత్నంగా హెూటల్ వద్ద పూరీలు వేస్తూ అక్కడ కస్టమర్లను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం మహిళ లతో ముచ్చటిస్తూ తనను ఎలా భారీ మెజార్టీతో గెలిపించారో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని కూడా అలాగే గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణి భరత్ ముఖ్యర్ల మల్లేశం నాయకులు, వెంకట్ రెడ్డి కానుగు బాలరాజు, బందారపు బిక్షపతి, గుండ్లపల్లి ముత్యాలు, ముఖ్యర్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ జాగ్రత్తలపై అవగాహన

నవతెలంగాణ-నల్లగొండడెస్క్

అర్వపల్లి మండలంలోని కొమ్మల ఐకేపీ సెంటర్ వద్ద రైతులకు, కూలీలకు, ఉపాధికూలీలకు వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తల గురించి వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ ఎల్ చరణ్, వర్షిత , నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి జి . కవిత, ఆశా కార్యకర్తలు పల్గొన్నారు.

యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

నవ తెలంగాణ - మద్దిరాల

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు గంజాయి ,డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు . ఆయన వెంట ఎస్సై మధు నాయుడు సిబ్బంది యువత గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాట వారసత్వం కలిగిన జహంగీర్‌ను గెలిపించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

నవతెలంగాణ-మదిరాల



భూమి ,భుక్తి ,విముక్తి కోసం సాగిన మహత్తరమైన వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కలిగిన భువనగిరి సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి ఎండి. జహంగీర్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం మండలం లోని గోరంట్ల గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి దీకొండ ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ సాయుధ పోరాటానికి కేంద్ర బిందువు అయిన తుంగతుర్తిలో బిజెపి మతోన్మాద శక్తులకు స్థానం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మనువాద పాలనతో దళితులు గిరిజనులు మైనార్టీలు మహిళలపై దాడులు హత్యలు చేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉన్న రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందన్నారు. నిరంతరం పేద ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న ఎర్రజెండా బిడ్డ జహంగీర్ ను ఆదరించాలన్నారు. తుంగతుర్తి ప్రాంతంలోని పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి మల్లు స్వరాజ్యం వారసత్వం కలిగిన ప్రాంతం నుండి జహంగీర్‌కు ఓట్లు పడేవిధంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. పేదల కోసం పోరాడుతున్న జహంగీర్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి , జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, ఆ మండల కార్యదర్శి కల్లేపల్లి భాస్కర్, గ్రామ శాఖ నాయకులు పోలో సైదులు, పాల్వాయి కవిత, దీకొండ రంగయ్య, వెంకన్న నరసయ్య ,దేవయ్య, కన్న వీరన్న, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన

నవతెలంగాణ-నూతనకల్



జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐపిఎస్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని టీక్యా తండా గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై జూకురు సైదులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల, విద్యార్థుల, రక్షణ చట్టాలు, విద్యావిధానాల సమస్యలను అధిగమించడం,సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం వంటి అంశాలపై,విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలి, లక్ష సాధన కోసం ఏ విధంగా కృషి చేయాలి అనే విషయాలపై పోలీస్ కళాబృందం సభ్యులు ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చిన శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలని చట్టాలను చేతుల్లోకి తీసుకోకుండా వాటిని గౌరవించి పోలీసు వారికి తెలియపరచాలని అన్నారు. సైబర్ మోసాలకు గురికావద్దని వ్యక్తిగత వివరాలు బ్యాంకు ఖాతా, ఓటిపి నెంబరు ఇతరులకు ఎవరికి తెలియపరచవద్దని, ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావద్దని తెలిపారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని, అలాగే వేధింపులపై 100కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ విజయ్,దామోదర్, రాము, పోలీస్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య,గోపి,గురు లింగం,కృష్ణ, చారి పాల్గొన్నారు.



సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని జిల్లా జడ్జికి వినతి

నవతెలంగాణ-చౌటుప్పల్

నూతనంగా ఎన్నికైన చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జడ్జి జయరాజ్, అడిషనల్ జిల్లా జడ్జి మారుతిదేవి, సబ్ జడ్జి దశరథరామయ్యలను కలిసి చౌటుప్పల్‌లో సబ్ కోర్టు ఏర్పాటుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ ఇప్పటికే రెవెన్యూ డివిజన్‌గా, ఏసీపీ హెడ్‌క్వార్టర్స్‌గా, వివిధ డిపార్ట్ మెంట్లలో హెడ్‌క్వార్టర్స్ ఉండడం వల్ల సబ్ కోర్టు కేసులు కూడా ఎక్కువ ఉన్నందున చౌటుప్పల్‌లో సబ్ కోర్టు ఏర్పాటుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉడుగు శ్రీనివాస్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ తాడూరి పరమేశ్, ప్రధానకార్యదర్శి రాపోలు వేణు, జాయింట్ సెక్రటరీ జెల్ల రమేశ్, కోశాధికారి పడమటి మహిపాల్‌రెడ్డి, మక్తాల నర్సింహాగౌడ్, నర్రి స్వామి, జక్కర్తి శేఖర్, జంపాల శ్రీశైలం, ఎలమోని శ్రీనివాస్, వాకిటి నర్సింహారెడ్డి, బాల్యం వెంకటాచలం, పాల పరమేశ్ ఉన్నారు.

అవినీతిని ప్రశ్నించే ధైర్యం కమ్యూనిస్టులకే ఉన్నది

నవతెలంగాణ -చిట్యాలటౌన్



పాలకుల అవినీతిని ప్రశ్నించే ధైర్యం వామపక్ష, కమ్యూనిస్టు అభ్యర్థులకు తప్ప, ఏ ఇతర రాజకీయ పార్టీలకు లేదని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. మండలంలోని వెలిమినేడు గ్రామంలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పని చేసే సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఈ నెల 19న భువనగిరిలో జరిగే జహంగీర్ నామినేషన్ కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పోలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ హాజరుకానున్నట్టు తెలిపారు. మండలం నుండి అధిక సంఖ్యలో నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల రూరల్ కార్యదర్శి అరూరి శ్రీను, మండల నాయకులు నెలికంటి నర్సింహా, మెట్టు నర్సింహా, అరూరి శంభయ్య , వివిధ ప్రజా సంఘాల నాయకులు సుర్కంటి బుచ్చిరెడ్డి, అరూరి నర్సింహా,ఊడుగు సత్తయ్య పాపిరెడ్డి, రాంరెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలే ఊపిరిగా జీవిస్తున్న జహంగీర్‌ను గెలిపించండి

నవతెలంగాణ -నార్కట్‌పల్లి



ఉద్యమాలే ఊపిరిగా జీవిస్తున్న ఎండి.జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి చెరుకు పెద్దులు కోరారు. సోమవారం మండల పరిధిలోని లింగోటం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు, ప్రజా సమస్యలపై ఆందోళనలు, ధర్నా లు నిర్వహించి ప్రభుత్వాల దృష్టి కి తీసుకుపోయి,సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాటాలు చేసిన చరిత్ర జహంగీర్ ది అని అన్నారు. జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న ,మండల కమిటీ సభ్యులు నన్నేసాబ్ ,ఓరుగంటి సత్తయ్య, రాములు పాల్గొన్నారు.

17న శ్రీరామనవమి వేడుకలు

నవతెలంగాణ-నకిరేకల్



శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ఐశ్వర్య సాయి మందిరం ఆవరణలో ఈ నెల 17న సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఘ బ వ ం గా నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మెన్ వనమా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి యాటా మధుసూధన్ రెడ్డి, కోశాధికారి ఉప్పుల వెంకటరమణ, వైస్ చైర్మన్ లు తొనుపునూరి శ్రీనివాస్, గట్టు శ్యామ్ సుందర్, సహాయ కార్యదర్శులు బాణాల రామ్ రెడ్డి, తోనుపునూరి రాంబాబు, నోముల గోవిందరాజులు, వలిశెట్టి స్వప్న,బండారు వేణుగోపాల్, కందగట్ల మమత, పిల్లలమర్రి సునిత, దాచెపల్లి శ్రీనివాస్, జోర్రిగల శ్రీనివాస్, పోతుల రాములు, వీరవెల్లి రఘునాథ్, డాక్టర్ రాపోలు రఘునందన్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని చందంపల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ధ్వజస్తంభన, ఆంజనేయ స్వామి, నవగ్రహ, దుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా మహెూత్సవాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మెట్ల మార్గంలో భక్తులకు వసతులు కల్పిస్తాం

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



మెట్ల మార్గం ద్వారా వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఈవో భాస్కర్ రావు తెలిపారు. సోమవారం కొండపై నుండి కింది వరకు మెట్ల మార్గంలో కాలినడకన కొండ కింది వరకు ఆయన పర్యటించారు. మార్గం మధ్యలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. మెట్ల మార్గం శుభ్రంగా ఉండే విధంగా చూడాలని సానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట దేవస్థానం బాధ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల నాయకుని జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రాజాపేట

కాంగ్రెస్ మండల నాయకులు రామ్ గొల్ల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా నాయకులు మేడిశెట్టి సురేష్, గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్, మండల కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పిండి కూర మహేష్, కోయ కనకయ్య, పెద్దోల సమ్మయ్య, సగ్గు లక్ష్మణ్ తదితరులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముల వారి కల్యాణం

నవతెలంగాణ-వలిగొండరూరల్



మండలంలోని అరూర్ మధిర అప్పారెడ్డిపల్లెలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం గణపతి పూజ, వాస్తు హోమం, కళ్యాణ మండప ప్రవేశము అనంతరం శ్రీ సీతా సమేత శ్రీ రాములవారి కళ్యాణం అంగరంగ వైభవంగా, భక్తుల కన్నులపండువగా వేద పండితులు కళ్యాణ తంతు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల ప్రభాకర్ రెడ్డి, తుమ్మల రవీందర్ రెడ్డి, తుమ్మల కృపాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణార్జున్ రెడ్డి, వెంకట్ నర్సింహ రెడ్డి, వెంకట్ నారాయణ రెడ్డి, నర్సింహ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కొమురయ్య, నర్సింహ, లచ్చయ్య, లింగయ్య, వెంకటేశం, బద్రి మల్లేశం ,శ్రీను సుధాకర్ తదితరులు పాల్గొన్నారు